# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
28-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 188

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ప్రియాంక గాంధీకి కాంగ్రెస్ పగ్గాలు!



దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. మొన్నటి ఎన్నికల్లో పుంజుకున్నట్లే కనిపించింది కానీ.. నాయకత్వం మాత్రం రాటు తేలడం లేదు. ముఖ్యంగా రాహుల్ నాయకత్వం పై అనేక రకాల సందేహాలు క్యాడర్లోనే ఉన్నాయి. ఆయనకంటే సోదరి ప్రియాంకవాద్ర పైనే క్యాడర్ ఎక్కువగా నమ్మకం పెట్టుకుంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను, ప్రచార సారధ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రా కే అప్పగించాలని కూడా కాంగ్రెస్ హై కమాండ్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

### బిజెపి దూకుడు ఆమెతో కళ్లెం

**రాహుల్ కేవలం పార్లమెంటరీ నేతగానే పరిమితం**

**హస్తం పెద్దల సరికొత్త వ్యూహం**

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రతిపక్ష నేత స్థానానికి పరిమితమవుతుండగా.. క్షేత్రస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను ప్రియాంక భుజాలకు ఎత్తుకునేలా ప్రణాళిక సిద్ధమైనట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో



## ఆర్టీసీలో ఎన్నికల సందడి!

**8 ఏళ్ల తర్వాత గుర్తింపు సంఘాలకు ఎన్నికలు**

తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు కాంగ్రెస్ మద్దతు

పార్టీ శ్రేణులు ఆ యూనియన్ గెలుపునకు సహకరించాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

2లో



## రామాపురంలో 'పల్లె పండుగ 3.0'..

**29న చంద్రబాబు, పవన్ రాక!**

సెప్టెంబర్ 29న రామాపురంలో కార్యక్రమానికి శ్రీకారం

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పర్యటనకు అధికారుల భారీ ఏర్పాట్లు

గ్రామీణ మౌలిక వసతుల కోసం రూ.10 వేల కోట్ల కేటాయింపు

సభా ప్రాంగణం, భద్రత, పార్కింగ్‌పై అధికారుల ప్రత్యేక దృష్టి

2లో



## బీజేపీపై మంత్రి ఉత్తమ్ ఫైర్

**రేషన్ కార్డుల వేదికగా పొలిటికల్ హీట్..**

నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

బీజేపీపై 'ఓటు చోరీ' ఆరోపణలు చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి

బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రశ్నలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంగా పరవాలేదు.. పార్టీగా మాత్రం ఫెయిల్ అవుతోంది. ప్రభుత్వ అధినేతగా రేవంత్ మంచి మార్కులు పొందుతున్నారు. కానీ పార్టీ పరంగా అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాత్రం చాలా వెనుకబడి ఉన్నారు. ప్రస్తుతం పార్టీలో మహేష్ కుమార్ గౌడ్ పనితీరుపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. పార్టీ క్యాడర్ కు, ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే బలమైన సమన్వయకర్తగా ఆయన వ్యవహరించాల్సి ఉంది.

## కాంగ్రెస్ ప్రభుత్వం సక్సెస్.. పార్టీ ఫెయిల్!





### సీఎంగా రేవంత్ దూకుడు

**టిపిసిసి చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ వైఫల్యం**

**పార్టీని చక్కదిద్దడంలో విఫలం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కానీ ఆ పని చేయకపోగా పార్టీలో అంతర్గత అసంతృప్తులను నియంత్రించడంలో కూడా ఘోరంగా విఫలమవుతున్నారనే విమర్శ ఉంది.

**అప్పటి కాంబినేషన్..:** ఉమ్మడి రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి- ధర్మపురి శ్రీనివాస్ కాంబినేషన్

- మిగతా 2వ పేజీలో



## ఆ ముగ్గురు బాటలో కవిత!

**జయలలిత, మమతా బెనర్జీ, మాయావతిల ఆదర్శంగా రాజకీయం**

**వారిలా పోరాడితేనే నెరవేరనున్న లక్ష్యం**

తెలంగాణలో కల్వకుంట్ల కవిత వ్యూహం ఏంటి? సొంత పార్టీతో విభేదించారు. సొంత వారిని వదులుకొని సొంతంగా రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. అయితే తెలంగాణకు తొలి మహిళా సీఎం కావాలన్నా లక్ష్యంతోనే ఆమె అడుగులు వేస్తున్నారు. జయలలిత, మమతా బెనర్జీ, మాయావతి బాటలోనే నడుస్తున్నారు. వారి మాదిరిగానే దూకుడు రాజకీయాలు చేస్తున్నారు.



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**ఆ ముగ్గురు మహిళా నేతలు తమ రాజకీయ ప్రారంభంలో అనుసరించిన వ్యూహాన్ని ఇప్పుడు కవిత కూడా అనుసరిస్తున్నారు. వారి మాదిరిగానే రాజకీయాలు చేస్తున్నారు కవిత.

**ఒక్కరే మహిళా ముఖ్యమంత్రి..**

ప్రస్తుతం దేశంలో మహిళా ముఖ్యమంత్రి ఒక్కరే ఉన్నారు. బిజెపి తరఫున ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖ గుప్త ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 15 సంవత్సరాలు పాటు పశ్చిమ బెంగాల్ ను తన కను సన్నల్లో పాలించారు మమతా బెనర్జీ. ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. తమిళనాడు ను ఏలిన జైలలిత మరణించి పదేళ్లు అయింది.

- మిగతా 3వ పేజీలో

## కాళేశ్వరంపై ఫోకస్!

**నవంబర్ నుంచి మరమ్మత్తుల పనులు**

**వచ్చే వేసవిలో గా పూర్తి చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ఎత్తిపోతలకు మరమ్మత్తులు చేసేందుకు సిద్ధపడుతోంది. ప్రాజెక్టు పరిధిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ, మరమ్మత్తుల పనులకు



2లో

## భారత రైల్వేలో కొత్త శకం..

దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలును ప్రారంభించిన అమిత్ షా

దేశంలో తొలిసారిగా పరుగులు తీసిన ఎల్ఎన్‌జీ రైలు

సబర్మతిలో ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించే టెక్నాలజీ

భారీగా ఆదా కానున్న ఇంధన ఖర్చు, తగ్గనున్న కాలుష్యం

## కొంప ముంచుతున్న ఫ్యామిలీ ప్యాక్!

రాజకీయంగా కొన్ని కుటుంబాలనే నమ్ముకుంటున్న జగన్

పార్టీతో పాటు అధికారం వస్తే పదవులు కూడా వారికే..

ఇప్పుడు కష్టకాలంలో ఉంటే పార్టీని విడిచి పెడుతున్నది వారే

నిలువరించాలని కోరుతున్న పార్టీ శ్రేణులు



3లో



## శ్రీకాకుళం ఎంపీగా తమ్మినేని?!

**ఆయన ముందు ఉన్న ఏకైక ఆప్షన్ అదే**

**ఎమ్మెల్యే టికెట్ లేదని తేల్చేసిన జగన్**

**తీవ్ర ఆలోచనలో సీనియర్ నేత**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక స్థానం. ఉమ్మడి రాష్ట్రంలోనైనా.. నవ్యాంధ్రప్రదేశ్లోనైనా



## సిరిసిల్లకు సీఎం రాక.. ముందే ప్రశ్నలతో కేటీఆర్ లేఖ..

సిరిసిల్లలో 8 వేల ఎకరాల భూమి ఎక్కడుందంటూ కేటీఆర్ ప్రశ్న

నేతన్నలు, రైతులు, మహిళల హామీలపై నిలదీత

పెండింగ్ బకాయిలు, అభివృద్ధి పనులపై తేదీలు ప్రకటించాలని డిమాండ్

సీఎం రేవంత్ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్న కేటీఆర్

3లో




# కాంగ్రెస్ ప్రభుత్వం సక్సెస్.. పార్టీ ఫెయిల్!

రిపీట్ అయిందని అంతా భావించారు. సీఎం రేవంత్ రెడ్డి- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆ పాత జంట మాదిరిగా ప్రభుత్వాన్ని,, పార్టీని నడిపిస్తారని భావించారు. కానీ సీఎంగా రేవంత్ సక్సెస్ అవుతున్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాత్రం తన పనితీరును మెరుగుపరుచుకోలేకపోతున్నారు. పార్టీలో అంతర్గత అసంతృప్తులను సామరస్యంగా సర్దుబాటు చేయలేకపోతున్నారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో, ఇతర నేతల అసంతృప్తుల సందర్భంలో పిసిసి చీఫ్ గా క్రమశిక్షణను కాపాడలేకపోయారు. పరోక్షంగా వారిపై అతి సానుభూతి ప్రదర్శించడం, సీఎం రేవంత్ వైపే తప్పు ఉందనే భావన కల్పించడం వంటివి చర్చనీయాంశం అవుతున్నాయి.

**మాస్ ఇమేజ్ లేదు..**

మహేష్ కుమార్ గౌడ్ ప్రజల నుంచి వచ్చిన నాయకుడు కాదు. ఆయనకు మాస్ ఇమేజ్ చాలా తక్కువ. ప్రజాబలం కంటే తెరవెనుక సంస్థాగత సర్దుబాటులతో వచ్చిన గుర్తింపు ఎక్కువ. నిజామాబాద్ జిల్లాకు చెందిన నేతగా చెప్పుకునే ఆయన.. అదే జిల్లాలోని కాంగ్రెస్ క్షేత్రస్థాయి కార్యకర్తలకు, స్థానిక నాయకులకు ఎంతవరకు



సుపరిచితం అనేది పెద్ద ప్రశ్న. ఇప్పటివరకు ప్రత్యక్ష ఎన్నికల్లో బలమైన ప్రజాబలంతో గెలిచిన దాఖలాలు లేవు. ప్రజాబలంతో గెలిచిన రికార్డు ఆయనకు లేదు. రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి తానే స్వయంగా పోటీ చేస్తానని ఆయన చెప్పుకున్నప్పటికీ.. పీసీసీ చీఫ్ హోదా, ఎమ్మెల్సీ పదవి లేకపోతే ఆయనను పట్టించుకునే వారు ఉండరు అనేది నిజామాబాద్ సర్కిల్ లో ఉన్న మాట. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అధ్యక్ష పదవి చేపట్టిన అవకాశం ఆయనకు వచ్చింది. కానీ దానిని సద్వినియోగం చేసుకునే స్థితిలో ఆయన లేరు.

## స్నేహితుడిని కలిసి వస్తానన్నాడు.. తీరా గ్రామ శివారులో శవమై కనిపించాడు!

**మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 27:** ఒక చిన్న మాట చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 'స్నేహితుడిని కలిసి వస్తా' అన్నదే అతను కుటుంబ సభ్యులతో చెప్పిన చివరి మాట. ఆ తర్వాత ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. బంధువుల ఇళ్లలోనూ ఆరా తీశారు. చివరకు పోలీసులకు మిస్సింగ్ ఫిర్యాదు చేశారు. ఇంతలో ఊహించని విధంగా గ్రామ శివారులో అతడి మృతదేహం కనిపించింది. దీంతో అసలు ఏం జరిగిందనే ప్రశ్న ఇప్పుడు మిస్టరీగా మారింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన కుడుకల శ్రీనివాస్ (40) ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి మంచిర్యాల వైపు వెళ్లిన ఆయన రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరుకోలేదు. మొదట కుటుంబ సభ్యులు సాధారణంగానే భావించినా సమయం గడిచేకొద్దీ ఆందోళన పెరిగింది. శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా స్పందన రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అతడి కోసం వెతకడం ప్రారంభించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ మిస్సింగ్ అయిన రోజే రాత్రి సుమారు 8 గంటల సమయంలో చెన్నూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర వైన్స్ వద్ద కనిపించినట్లు సమాచారం. అక్కడ తన దూరపు బంధువు గోదరి సమ్మయ్యతో కలిసి మద్యం సేవించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అక్కడి నుంచి శ్రీనివాస్ ఎటువైపు వెళ్లాడు? ఎవరితో వెళ్లాడు? ఆ తర్వాత ఏం జరిగింది? అనే విషయాలపై ఇప్పుడు పోలీసులు దృష్టి సారించారు. శ్రీనివాస్ కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలిస్తుండగానే శనివారం చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామ శివారులో ఆయన మృతదేహం కనిపించింది. అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# భారత రైల్వేలో కొత్త శకం..




భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (LNG) ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ (ఇూజ) ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ. 11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ. 23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది. ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ. 1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ. 700 కోట్లతో నిర్మించిన WAG-12 లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్-పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

# ఆర్టీసీలో ఎన్నికల సందడి!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు అక్టోబర్ 9న పోలింగ్ జరగనుంది. దీంతో కార్మిక సంఘాలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన మద్దతును ఒక యూనియన్ ప్రకటించడం చర్చనీయాంసంగా మారింది. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు తమ మద్దతు ఇస్తున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ మద్దతు ఆ యూనియన్కే నంటూ బాహాటంగా ప్రకటించారు. ఇదే విషయాన్ని పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూడా తెలియజేసినట్లు తెలుస్తోంది.

**సన్నాహక సమావేశం..**

ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నేతలు, టీ డబ్ల్యూ యు ప్రతినిధులు హాజరయ్యారు. కార్మికుల సమస్యలు, పని పరిస్థితులు, పెండింగ్ అంశాలు, ఆర్టీసీ భవిష్యత్ తదితర అంశాలపై చర్చ జరిగింది. టి డబ్ల్యూ యు విజయం కోసం క్షేత్రస్థాయిలో సమన్వయంతో




పనిచేయాలని పార్టీ శ్రేణులకు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఆర్టీసీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. టిపిసిసి ఉపాధ్యక్షుడు, జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ను పార్టీ ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్మిక సంఘం ప్రతినిధుల మధ్య సమన్వయం చూసే బాధ్యతను బొంతు రామ్మోహన్ కు అప్పగించింది.

**పక్కా వ్యూహంతో కాంగ్రెస్..**

ఆర్టీసీ ఎన్నికల్లో తాము మద్దతు తెలిపిన కార్మిక సంఘం విజయం సాధించేలా కాంగ్రెస్ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. డిపోల వారీగా పార్టీ నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం సిద్ధం చేసింది. కాకా తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంగం ఎన్నికల షెడ్యూల్ను కార్మిక శాఖ ఈనెల 18న విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అక్టోబర్ 14, 15వ తేదీలను కేటాయించారు. అక్టోబర్ 17న ఫలితాలను ప్రకటించనున్నారు.

**చివరిసారిగా 2016లో..**

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు చివరిసారిగా 2016లో జరిగాయి. ఇప్పుడు సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆర్టీసీలో గుర్తింపు సంఘం హోదా కోసం పలు కార్మిక సంఘాలు పోటీకి సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ తో పాటు ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, కార్మిక సంఘ, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వంటి సంఘాలు ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 26న పోటీ చేసే యూనియన్లకు ఎన్నికల గుర్తును కేటాయించనున్నారు.

# బీజేపీపై మంత్రి ఉత్తమ్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 27: పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమం రాజకీయ వ్యాఖ్యలకు వేదికగా మారింది. నేరేడుచర్లలో కార్డుల పంపిణీ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. బీజేపీ ప్రజలను మోసం చేసిందని, ఓటు చోరీకి పాల్పడిందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశం ఎదురుచూస్తోందని, భవిష్యత్తులో ఆయన ప్రధాని అవుతారని వ్యాఖ్యానించారు. నేరేడుచర్ల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సన్నబియ్యంపై మంత్రి ఏమన్నారు?**

పేద కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో సరఫరా చేసిన దొడ్డు బియ్యంపై ఆయన విమర్శలు చేశారు. ఆ బియ్యాన్ని చాలామంది వినియోగించకుండా విక్రయించేవారని వ్యాఖ్యానించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ తెలంగాణలో అమలు చేస్తున్న విధంగా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 90 శాతం మంది పేదలు సన్నబియ్యం తింటున్నారని ఆయన చెప్పారు.

**బీఆర్ఎస్ పాలనపై ప్రశ్నలు**

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో కొత్త రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం పెద్ద సంఖ్యలో కొత్త కార్డులను అందిస్తున్నట్లు వివరించారు. సూర్యాపేట జిల్లాలో మూడు లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో సుమారు పది లక్షల మంది సన్నబియ్యం పొందుతున్నారని చెప్పారు.

**నియోజకవర్గంలో లక్షకు పైగా కొత్త కార్డులు**

తన నియోజకవర్గ పరిధిలో లక్షకు పైగా కొత్త రేషన్ కార్డులు అందించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వీటి ద్వారా సుమారు మూడు లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ఇదే సందర్భంగా కేంద్రంలోని బీజేపీపై రాజకీయ విమర్శలు చేసిన మంత్రి.. రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమం రాజకీయ విమర్శలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రస్తావనతో సాగింది.

# కాళేశ్వరంపై ఫోకస్!

నవంబర్ రెండవ వారం నుంచి పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 2027 వర్షాకాలానికి ప్రారంభం ముందే ఈ మూడు బ్యారేజీల పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టింది కాంగ్రెస్ సర్కార్. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సీరియస్ గా ఆలోచన చేస్తోంది.

**గతంలో అలా..**

గతంలో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సైతం సి పేజీలు, ఇతర సాంకేతిక లోపాలు బయటపడ్డాయి. దీంతో ప్రాజెక్టు భద్రతపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. నిపుణుల కమిటీల సిఫార్సులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపేందుకు రంగం సిద్ధం చేసింది. తాత్కాలిక మరమత్తులతో సరిపెట్టకుండా, బ్యారేజీల పటిష్టతకు అవసరమైన పూర్తిస్థాయి పునరుద్ధరణ పనులను పగడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**అత్యాధునికంగా పనులు..**

ఈ సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ పనుల్లో భాగంగా.. బ్యారేజీ పునాదులను మరింత పటిష్టం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అత్యాధునిక గ్రౌంటింగ్ పద్ధతులను వినియోగించనున్నారు. వరద ఉధృతికి నేల కోతకు గురికాకుండా నిరోధించేందుకు స్టిల్లింగ్ బేసిన్లను మరింత విస్తరించనున్నారు. నీటి ఊటలను అరికట్టేందుకు నూతన కటాఫ్ వాల్స్ నిర్మించనున్నారు. నిర్మాణ నాణ్యత, సాంకేతిక భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి దశలోనూ నిపుణుల పర్యవేక్షణ ఉండేలా ఇంజనీరింగ్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పూర్తయితే రాష్ట్రంలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు సామర్థ్యం తిరిగి పుంజుకోనుంది. అదే జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగంలో మైలేజ్ రావడం ఖాయం.

**అప్పట్లో అవినీతి ఆరోపణలు..**

గత గులాబీ ప్రభుత్వ హయాంలో చాలా రకాల ఎదురు దెబ్బలు తగిలాయి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో భారీ అవినీతి జరిగిందనేది కాంగ్రెస్ ఆరోపణ. గత ఎన్నికల్లో ఈ అంశం ప్రధానంగా ప్రభావం చూపింది. రైతాంగం కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతోంది. మూడో ఏడాది సమీపిస్తోంది. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి విమర్శలు రాకుండా జాగ్రత్తలు పడుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల మరమ్మతులకు సిద్ధపడుతోంది. వచ్చే ఏడాది వేసవిని గడువుగా పెట్టుకుంది. చూడాలి మరి ఎంతవరకు అధిగమించగలదో..

# ప్రియాంక గాంధీకి కాంగ్రెస్ పగ్గాలు!



మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీని క్యాడర్ ఎక్కువగా ఓన్ చేసుకుంటోంది.

**ప్రచారానికి విశేష స్పందన..** వివిధ రాష్ట్రాల ఎన్నికల సమయంలో ప్రియాంక గాంధీ ప్రచారానికి విశేష స్పందన వస్తోంది. రాహుల్ తో పోల్చుకుంటే సక్సెస్ రేట్ కూడా ఆమెకు అధికం. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ భారత్ జూడో యాత్రలో బిజీగా ఉన్నప్పుడు ప్రియాంక నేతృత్వంలో సాగిన దూకుడు ప్రచారం కాంగ్రెస్కు అద్భుతమైన విజయాన్ని అందించగలిగింది. ముఖ్యంగా ఆమె ప్రసంగించే తీరు, ప్రజలతో మమేకమయ్యే విధానం, తన నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుకు తెచ్చే హావభావాలు.. ఉత్తర, మధ్య భారత ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక నేతల మధ్య ఉండే గ్రూపు తగాదాలను చక్కదిద్దడంలోనూ.. మహిళా ఓటర్లను ప్రభావితం చేయడంలోనూ ప్రియాంక అనుసరించే శైలి రాహుల్ కంటే చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతోంది.

**ఆమె స్టైల్ వేరు..**

ఇప్పటివరకు రాహుల్ గాంధీని నిలువరించగలిగింది బిజెపి. కానీ ప్రియాంక గాంధీ రంగంలోకి దిగితే ఆ సమీకరణ మారుతోంది. ఆమె ఎక్కువగా స్థానిక సమస్యలు, ధరల పెరుగుదల, మహిళా సంక్షేమం, నిరుద్యోగం వంటి అంశాల చుట్టూనే ప్రచారాన్ని నడిపిస్తూ బీజేపీపై ఎదురు దాడి చేస్తారు. దీనివల్ల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్ కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెర వెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలుగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

**సార్వత్రిక ఎన్నికలు టార్గెట్**

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ జాతీయస్థాయిలో అతిపెద్ద పార్టీగా నిలవాలని భావిస్తోంది. అది కేవలం ప్రియాంక గాంధీని రంగంలోకి దించడం వల్లే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్న ప్రతిసారి ప్రియాంక ఒక వరంలా భావిస్తున్నారు. ఈసారి పూర్తిస్థాయిలో ఆమెను ప్రయోగించి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని నిలువరించాలి అనేది కాంగ్రెస్ పెద్దల ఆలోచన. ఒకవైపు పార్లమెంటరీ నేతగా రాహుల్ ఉంటూనే.. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు బాట ప్రియాంకకు అప్పగించాలి అనేది బలమైన వ్యూహంగా కనిపిస్తోంది. మరి ఇది ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# సిరిసిల్లకు సీఎం రాక.. ముందే ప్రశ్నలతో కేటీఆర్ లేఖ..

హైదరాబాద్, సెప్టెంబర్ 27: సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగుపెట్టకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. సీఎం పర్యటనకు స్వాగతం చెప్పాల్సిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వరుస ప్రశ్నలను సంధించారు. దాదాపు మూడేళ్ల తర్వాత సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి.. ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏం సమాధానం చెబుతారన్న అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ మేరకు కేటీఆర్ సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేశారు.

**8 వేల ఎకరాల భూమి ఎక్కడ?**

సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారంటూ అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న 2,400 ఎకరాల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఆ భూములు ఉన్నాయో వెల్లడిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఆరోపణలను నిరూపించలేకపోతే సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు.

**నేతన్నల సమస్యలేంటి?**

సిరిసిల్ల అంటే ముందుగా గుర్తొచ్చేది నేతన్నలు. ఈ అంశాన్నే కేటీఆర్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు,



ఇతర ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా బీఆర్ఎస్ హయాంలో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.60 కోట్ల బకాయిలు ఉన్నాయని, 10 శాతం యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వీవింగ్, అపరెల్ పార్కుల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

**రైతు హామీలపై కూడా ప్రశ్నలే**

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. పెండింగ్ రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబీమా అంశాలను ప్రస్తావిస్తూ అమలు తేదీలను ప్రకటించాలని కోరారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని తరలించే ప్రణాళికపైనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పెన్షన్ నుంచి విద్య వరకు..**

సిరిసిల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కేటీఆర్ కోరారు. రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్ల పెంపు, మహాలక్ష్మి పథకం, కల్యాణలక్ష్మి తులం బంగారం, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం వంటి హామీల అమలుపైనా సమాధానం కోరారు.ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ నుంచి గొర్రెలు, చేపపిల్లల పంపిణీ వరకు పలు అంశాలను కేటీఆర్ ప్రస్తావించారు. దళితబంధు, బీసీబంధు పథకాల పరిస్థితిపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. మొత్తంగా సీఎం పర్యటనకు ముందే కేటీఆర్ సంధించిన ఈ ప్రశ్నలు సిరిసిల్లలో రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి.



# ఆ ముగ్గురు బాటలో కవిత!

ఉత్తరప్రదేశ్లో అధికారానికి మాయావతి దూరమై రెండు దశాబ్దాలు దాటుతోంది. ఇటువంటి సంక్లిష్ట సమయంలో కవిత తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రి కావాలన్నా ఆశతో పని చేస్తున్నారు.

**చాలా అరుదు..**

ఒక ప్రాంతీయ పార్టీ నుంచి మహిళలు ముఖ్యమంత్రి కావడం అంటే చాలా కష్టం. అత్యంత అరుదు కూడా. ఎన్నెన్నో పోరాటాలు చేసిన తరువాతనే జయలలిత, మమతా బెనర్జీలు ముఖ్యమంత్రులుగా పదవులు చేపట్టారు. ఆ స్థాయిలో పోరాటాలు చేయగల సత్తా ఉంటే తెలంగాణలో మహిళా సీఎంగా కవిత సాధించగలరు. అయితే ఎన్నో పోరాటాలు చేయాలి. ఇప్పటికీ కవిత కెసిఆర్ కుమార్తె గానే ప్రజలు భావిస్తున్నారు. ఆమె తనకంటూ ఒక సొంత ఇమేజ్ను క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ విషయంలో మాత్రం ఆమె చాలా అడుగులు వేయాల్సి ఉంది. ముఖ్యంగా ఆమె ఎంచుకునే మార్గం బట్టి ఆమె లక్ష్య సాధన ఉండనుంది.

**చాలామంది ఫెయిల్..**

ఉమ్మడి ఏపీలో నందమూరి లక్ష్మీపార్వతి ముఖ్యమంత్రి అభ్యర్థిగానే తన పోరాటం చేశారు. నందమూరి తారక రామారావు మృతి చెందిన తర్వాత సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. కానీ తర్వాత తన పార్టీని నిలబెట్టుకోలేక పోయారు. మరోవైపు తెలంగాణలో సినీ గ్లామర్ తో రాజకీయాల్లో అడుగుపెట్టారు రాములమ్మ విజయశాంతి. కానీ అనుకున్న స్థాయిలో పార్టీని నడపలేకపోయారు. పార్టీని బిజెపిలో విలీనం చేశారు. 2022లో తెలంగాణలో షర్మిల సైతం ఇదే మాదిరిగా పార్టీ పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేశారు. కానీ సక్సెస్ కాలేదు ఆ పార్టీ. దీంతో తన పార్టీని కాంగ్రెస్లో విలీనం చేశారు. ఇటువంటి చరిత్ర కలిగిన మహిళా రాజకీయాల్లో కవిత ఎంతవరకు రాణించగలరు అనేది చూడాలి.

# రామాపురంలో 'పల్లె పండుగ 3.౦'..



(మొదటి పేజీ తరువాయి)

రామాపురం, సెప్టెంబర్ 27: నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురం గ్రామం మరో కీలక కార్యక్రమానికి వేదిక కానుంది. సెప్టెంబర్ 29న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇక్కడ పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని ఇద్దరు నేతలు లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీంతో రామాపురంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొంది. పల్లెల్లో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం తదితర సదుపాయాలపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపింది.

**రూ.10 వేల కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు**

'పల్లె పండుగ 3.0' కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా గ్రామీణ రహదారులు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, ఇతర అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు కూడా ఈ పథకంలో ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.

**రామాపురం వైపు అధికారుల దృష్టి**

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నెల్లూరు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. సభ నిర్వహించే ప్రదేశం, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**భారీగా తరలిరానున్న ప్రజలు?**

కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు కూడా సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన జనసేన, బీజేపీ నాయకులతో సమావేశాలు నిర్వహించి ప్రజా సమీకరణ, కార్యక్రమ నిర్వహణపై చర్చించినట్లు కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 29న రామాపురంలో జరిగే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సూచించారు.

**అభివృద్ధి పనులపై ఫోకస్**

'పల్లె పండుగ 3.0' ప్రారంభ కార్యక్రమం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కేటాయించిన నిధులతో ఏ ప్రాంతాల్లో ఎలాంటి పనులు చేపట్టాలనే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒకే వేదికపై పాల్గొంటుండటంతో రామాపురం పర్యటనపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు తుది దశకు తీసుకెళ్తున్నారు.

# శ్రీకాకుళం ఎంపీగా తమ్మినేని?!

జిల్లాకు ఎనలేని ప్రాధాన్యం. ఏ పార్టీ అధికారంలో ఉన్న.. ఆ జిల్లా నేతలకు సముచిత స్థానం దక్కడం ఖాయం. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏకంగా స్పీకర్ పదవి ఆ జిల్లాకు చెందిన తమ్మినేని సీతారాంకు కేటాయించారు. రాష్ట్ర మంత్రులుగా ధర్మాన బ్రదర్స్ తో పాటు డాక్టర్ అప్పలరాజుకు బాధ్యతలు ఇచ్చారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వ హయాంలో అబ్బాయి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు కేంద్రమంత్రి పదవి.. బాబాయ్ అచ్చం నాయుడుకు రాష్ట్ర మంత్రి పదవి వరించింది. అయితే ఈ జిల్లా రాజకీయాల్లో ధర్మాన, కింజరాపు కుటుంబాలది ప్రత్యేక స్థానం.. అయితే ఒకప్పుడు విశేష ప్రభావం చూపించిన తమ్మినేని సీతారాం పరిస్థితి మాత్రం అగమ్య గోచరంగా మారింది. ఆయన పదవీ విరమణ గౌరవప్రదంగా దక్కలేదు. కుమారుడుకు మంచి రాజకీయ భవిష్యత్తు ఇవ్వాలనుకున్న ఆయన కోరిక తీరలేదు.

**సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా..**

ఆమదాల వలస నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించారు తమ్మినేని సీతారాం. 1999 ఎన్నికల వరకు మకుటం లేని మహారాజుగా మారారు. టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఆయన మంత్రి అయ్యారు. 2004లో తొలిసారిగా టిడిపి అభ్యర్థిగా ఓడిపోయారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి టిడిపిలో చేరి నట్టే చేరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆ పార్టీ నుంచి మూడుసార్లు పోటీ చేసి ఒక్కసారి మాత్రమే గెలిచారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయేసరికి తమ్మినేని సీతారామును పక్కనపెట్టి ద్వితీయ శ్రేణి నాయకుడు చింతాడ రవికుమార్ కు బాధ్యతలు అప్పగించారు. అయితే జిల్లాలో తన ప్రాధాన్యత తగ్గిపోతుండడంతో తీవ్రంగా రగిలిపోయారు తమ్మినేని. వెంటనే అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి తన ఆవేదనను తీసుకెళ్లారు. పార్టీ నుంచి బయటకు వెళ్లిపోతానని కూడా అల్టిమేట్ ఇచ్చారు. కానీ జగన్ మాత్రం తమ్మినేనికి ఒక్క అవకాశం కల్పించారు. శ్రీకాకుళం పార్లమెంటు టికెట్ ఆఫర్ చేశారు.

**రామ్మోహన్ నాయుడు హ్యాట్రిక్..**

అయితే గత మూడుసార్లు శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేసి గెలిచారు రామ్మోహన్ నాయుడు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారు. అయితే ఆయన విషయంలో తమ్మినేని సీతారాం ఆందోళనతో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లో తనకు ఎంపీ సీటు సేఫ్ కాదని ఆయన భావిస్తున్నారు. అందుకే తిరిగి ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతలు తన కుమారుడికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం పోటీ చేస్తే ఎంపీ గానేనని.. ఎమ్మెల్యేగా చాన్స్ లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎంపీగా పోటీ చేస్తే తనకు ఇబ్బంది కరం అని తమ్మినేని భావిస్తున్నారు. మరి తమ్మినేని చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# కొంప ముంచుతున్న ఫ్యామిలీ ప్యాక్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక చర్చ నడుస్తోంది. ఇకనుంచి రాజకీయ ప్రాధాన్యం ఉన్న కుటుంబాలకు ఎక్కువ టికెట్లు కేటాయించకూడదన్న డిమాండ్ పెరుగుతోంది. విజయనగరం జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఈ డిమాండ్ మరింత పెరుగుతూ వస్తోంది. ఉత్తరాంధ్రలో తీసుకుంటే రెండు కుటుంబాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చి చేతులు కాల్చుకున్నారు జగన్మోహన్ రెడ్డి. విజయనగరం నుంచి బొత్స ఫ్యామిలీకి.. శ్రీకాకుళం నుంచి ధర్మాన కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చి తప్పు చేశారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. జగన్ 2014లో బలమైన ప్రతిపక్ష నాయకుడిగా నిలిచారు. 2019లో ప్రభంజనం సృష్టించారు. 2024 లో అయితే అదే స్థాయిలో ఓడిపోయారు. అయితే ఈ మూడు ఎన్నికల్లోను ఏ జిల్లాలో కూడా ఫ్యామిలీల ప్రాధాన్యం లేదు. రాష్ట్రస్థాయిలో ఎన్నికలు జరిగాయే తప్ప జిల్లా స్థాయిలో ప్రభావితం చేసే నాయకులు లేరు.

**బొత్స ఫ్యామిలీతో సీన్ రివర్స్..**

విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబం పై ఆధారపడి జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేశారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యేతో పాటు ఎంపీ టికెట్లు ఇచ్చారు. చివరకు జిల్లా పరిషత్ చైర్మన్ తో పాటు పార్టీ జిల్లా పగ్గాలు కూడా ఆ కుటుంబానికి అప్పగించారు. అయితే ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన చిన్న శ్రీను బయటకు వెళ్లిపోవడంతో పెద్ద దెబ్బ తగిలింది. దారుణమైన పరిస్థితి ఇప్పుడు విజయనగరంలో ఎదురయింది. శ్రీకాకుళం జిల్లాలో కూడా అదే పరిస్థితి. ధర్మాన బ్రదర్స్ ఎప్పుడు ఎలా ఉంటారో తెలియదు. పార్టీని వారి చేతిలో పెట్టారు. ధర్మాన ప్రసాదరావు పదవిలో ఉంటే ఒకలా మాట్లాడతారు. పదవిలో లేకపోతే ఇంకోలా వ్యవహరిస్తారు. అధినేత జగన్ మోహన్ రెడ్డిని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**రాయలసీమలో అంతే..**

రాయలసీమలో కూడా కొన్ని కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి ఫ్యామిలీకి ఏకంగా భారీగా టికెట్లు కట్టబెట్టారు. రాజకీయంగా వారికే ప్రాధాన్యమిచ్చారు. వారితో విభేదించే నాయకులకు పెద్దగా పట్టించుకోలేదు. అనంతపురంలో కేతిరెడ్డి ఫ్యామిలీకి అదే మాదిరిగా ప్రాధాన్యమిచ్చారు. ఇలా ఒక్కో జిల్లా రాజకీయాన్ని.. ఒక్కో కుటుంబానికి అప్పగించడం ద్వారా.. వారిని రాజకీయంగా బలోపేతం చేయడమే కానీ.. పార్టీకి ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఆ ఫ్యామిలీని నమ్ముకొని.. పార్టీని వారికి అప్పగించి.. ఇప్పుడు వారితోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే ఈసారి అటువంటి ఫ్యామిలీలను నియంత్రించాలన్న డిమాండ్ వైసీపీలో పెరుగుతోంది. మరి జగన్ మైండ్ లో ఏముందో చూడాలి.


GHMC hmda Growing Global TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు కొండ లక్ష్మణ్ బాపూజీ

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కొండ లక్ష్మణ్ బాపూజీ నిర్మాణ కమిటీ,పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కలికితురాయి కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం మొత్తం పోరాటాలు, త్యాగాల సమాహారమని అన్నారు.తొలిదశ, మలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ఆయన తెలంగాణ రాష్ట్రం రాక ముందే మరణించడం దురదృష్టకరమని అన్నారు. వెనుకబడిన తరగతుల, దళిత, గిరిజన ప్రజల హక్కుల కోసం ఆయన నిరంతరం శ్రమించారని, ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం పద్మశాలీ సంఘాన్ని బలోపేతం చేసి, వారి ఆర్థికాభివృద్ధికి ఆప్కో సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. .ఈ కార్యక్రమంలో నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి,మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి,పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు సురపల్లి గణేష్ నేత,పద్మశాలి సంఘం నాయకులు,యువజన నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు,తదితరులు,పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు

### డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** కాలనీలలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు, వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శేషాద్రి నగర్ కాలనీ రోడ్ నెంబర్ 5లో అసోసియేషన్ అధ్యక్షులు కాసా సోమయ్య ఆధ్వర్యంలో, బి.యన్.రెడ్డి భ్రూంగి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ భ్రూంగి శిరీష్ నేతృత్వంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లలేని పేదలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని చెబుతూ, ఈ కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి పైగా వివిధ వ్యాధులకు పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు పొందారు. డాక్టర్ భ్రూంగి శిరీష్ కుమార్ తో పాటు వారి వైద్య బృందం బిపి, జిఆర్బిఎస్, బిఎంఐ పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఈసీజీ, పల్మనరీ ఫంక్షన్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాదర్ గుల్ డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతి వేడుకలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని భవన రుషి కాలనీ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ, తెలంగాణ పద్మశాలి సంఘం కార్యదర్శి యాదగిరి, మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజంలో సమానత్వం, స్వాభిమానం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. యన ఆశయాలు, ఆదర్శాలు మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయాల సాధనకు మనమందరం కృషి చేద్దాం అన్నారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం నాయకులు రాపోలు సత్తయ్య, దొంత రాజు, బండారి యాదగిరి, బిర్రు రాధాకృష్ణ, మునిగపాటి విష్ణు, కొంపల్లి జగదీష్, సామల యాదయ్య, రెబ్బ ప్రవీణ్ కుమార్, నోముల శేఖర్, కోట శ్యామ్ కుమార్, ఏర్వ కుమారస్వామి, విడెం రమేష్,శిరందాస్ నరేందర్, శిరందాస్ ప్రభాకర్, మల్లేష్, పులి లక్ష్మణ్ ప్రసాద్, చేనేత కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.చి. విద్యాసాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి రిజిస్ట్రార్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన దేశానికి, తెలంగాణ ప్రాంతానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకుంటూ పలువురు అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

## స్వర్గీయ దాసరి జంగమ్మకు కష్టపడే తత్వం, సేవాభావం ఎక్కువ

### తెలంగాణ రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** స్వర్గీయ దాసరి జంగమ్మ కష్టపడే తత్వం, సేవా భావం, కుటుంబం పట్ల ఆమెకున్న అంకితభావం మరువలేనిదని తెలంగాణ రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం శివరాంపల్లిలోని ప్రజా భవన్ లో నిర్వహించిన జంగమ్మ దశదిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్వర్గీయ దాసరి జంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ దాసరి జంగమ్మ దశదినకర్మలో పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గుండె ధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆమె కుటుంబం అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేని గుర్తు చేశారు. తన పిల్లలను సత్ప్రవర్తనతో, ఉన్నతమైన విలువలతో పెంచి, మంచి కుటుంబ విలువలను వారికి అందించిన విధానాన్ని కొనియాడారు. జంగమ్మ గారు తన జీవితంలో పాటించిన క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేసే స్వభావం కుటుంబ సభ్యులకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు దాసరి రమేష్, దాసరి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు స్థానిక నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మోహన్ రావు, పంబాల రాజు ఇతర బంధుమిత్రులు పాల్గొన్నారు.



## తాళ్లకుంటలో హార్ట్ డే

### అత్యవసర చికిత్స పై ప్రజలకు అవగాహన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ పెద్ద తాళ్ల కుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. మైత్రి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో గుండెపోటు వస్తే అత్యవసర చికిత్స ఎలా అందించాలి, ఏ విధంగా సిపిఆర్ చేయాలి అనే విషయాలను మైత్రి ఆసుపత్రి సీనియర్ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ సాదిక్ ఆజాం, రంగా శ్రీకాంత్ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద తాళ్ల కుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బర్ల జంగన్న, ప్రధాన కార్యదర్శి దుర్గా దాస్, మల్లికార్జున్ రెడ్డి, కొండమీది హరినాథ్ తోపాటు వివిధ రాజకీయ పార్టీల కు చెందిన నాయకులు, పుర ప్రముఖులు కొలను సుభాష్ రెడ్డి, నారా గూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్, ధర్మారెడ్డి, పాత్రికేయులు మ్య డం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞాపకాల బడిలో – స్నేహితుల సందడి..

### 29 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట చేరిన 1996--97 బ్యాచ్

### గురువులను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేసిన పూర్వ విద్యార్థులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** 29 ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో కూర్చొని చదువుకున్న చిన్ననాటి స్నేహితులు,ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట చేరారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేశారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996--97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బుద్వేల్‌లోని ఎస్ఎన్ఆర్ బ్యాంకెట్ హాల్‌లో ఆత్మీయంగా జరిగింది.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాళ్లు ఉమాదేవి,సునీతలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేయడంతో పాటు పాదాభివందనం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. గురువులను చూసిన విద్యార్థులు ఒక్కసారిగా పాఠశాల రోజుల జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాళ్లు ఉమాదేవి,సునీత మాట్లాడుతూ..తమ వద్ద చదువుకున్న విద్యార్థులంతా 29 ఏళ్ల తర్వాత కూడా అదే ఆత్మీయతతో ఒక్కచోట చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.విద్యార్థులు ఎక్కడ ఉన్నా తమను గుర్తు పెట్టుకుని ఇంత ప్రేమతో సత్కరించడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు.అప్పట్లో తరగతి గదిలో అల్లరి చేస్తూ కనిపించిన విద్యార్థులు, నేడు బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎదిగి తమ ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ విద్యార్థుల అభివృద్ధి, సంతోషమే ఉపాధ్యాయులకు నిజమైన గౌరవమని తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ..పాఠశాల రోజుల్లో తమకు విద్యతో పాటు క్రమశిక్షణ,విలువలు నేర్పిన గురువులను జీవితాంతం మరచిపోలేమన్నారు. ఎన్నేళ్లు గడిచినా బాల్య స్నేహాలు,గురువులతో ఉన్న అనుబంధం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనం తమకు మళ్లీ బాల్యాన్ని గుర్తుచేసిందని ఆనందం వ్యక్తం చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి పోలీసుల నివాళి




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 27:** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆర్ఐ డానియెల్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ ప్రజాసేవలను స్మరించుకున్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన ఆయన బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంతో పాటు రాష్ట్ర సాధన కోసం జరిగిన వివిధ ఉద్యమాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, ప్రజాసేవకు అంకితమైన బాపూజీ సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు శ్రీశైలం, అశోక్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాటేదాన్‌లో వైభవంగా పాండురంగ రుక్మిణి కళ్యాణ మహోత్సవం

## పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు.. ప్రత్యేక పూజలు, అభిషేకాలు





గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో కొలువై ఉన్న పాండురంగ రుక్మిణి సమేత దేవాలయంలో ఆదివారం స్వామివారి పల్లకి సేవ, కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ శ్రీ పాండురంగ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పాండురంగ నామస్మరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ, కలియుగంలో భక్తుల కోరికలు తీర్చే ప్రత్యక్ష దైవంగా శ్రీ పాండురంగ స్వామిని భక్తులు కొలుస్తారని అన్నారు. పుండరీకుడి తల్లిదండ్రుల భక్తికి మెచ్చిన శ్రీకృష్ణ పరమాత్మ ఇటుకపై నిలబడి విఠలుడిగా వెలసిన చరిత్ర ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల భక్తి, సమభావం, నిష్కామ సేవ వంటి గొప్ప విలువలను పాండురంగ మహత్యం సమాజానికి చాటిచెబుతుందని అన్నారు. మహారాష్ట్రలోని పండరీపూర్ నుంచి బాబుల్‌రెడ్డినగర్ వరకు విఠల్ నామస్మరణతో పండరీనాథుడిని కొలుచుకోవడం భక్తుల అదృష్టమని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధిస్తే కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొంటాయని, బాబుల్‌రెడ్డినగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులపై శ్రీ పాండురంగ రుక్మిణి సమేత స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పాండురంగ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పల్లకి సేవ, కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## నేడు ఎమ్మెల్యే మందుల సామేల్ పర్యటన



నూతనకల్ ( క్రైమ్ మిర్రర్): నేడు (సోమవారం ) మండలంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పర్యటన ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి తెలిపారు. నూతనకల్ మండల కేంద్రములో ఉపాధి హామీ నిధులతో నిర్మించు ఫుడ్ గ్రేయిన్ స్టోరేజ్, గ్రామ మహిళ సమక్య భవన నిర్మాణముల శంకుస్థాపన,గుండ్లసింగారం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించు నూతన గ్రామ మహిళ సమైక్య భవనం నిర్మాణ్యా శంకుస్థాపన చేస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో ప్రజా ప్రతినిధులు,మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, సోషల్ మీడియా కోఆర్డీనేటర్ లు అధిక సంఖ్యలో హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

### బాపూజీ చిత్రపటానికి కేటీఆర్ ఘన నివాళులు

గండిపేట(క్రైమ్ మిర్రర్): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ ప్రజా సేవ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. స్వాతంత్ర పోరాటంలో 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం గడిపారు. తెలంగాణ పోరాటంలో నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని కూడా ప్రాయంగా త్యాగం చేసిన గొప్ప త్యాగశాలి అని ఆయన అన్నారు ఇంతటి మహనీయుని సేవలను బాధితరాలకు తెలియజేయడం మన బాధ్యత. కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్ రెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తిక్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

## సీఎం రేవంత్‌రెడ్డికి సామాజిక సేవకుడు ఆడికె మహేందర్ విజ్ఞప్తి



గండిపేట(క్రైమ్ మిర్రర్): మామునూరు విమానాశ్రయానికి తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని సామాజిక సేవకుడు, కురుమ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆడికె మహేందర్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన అభిప్రాయంతో పాటు తమ సామాజిక వర్గం, ప్రజల అభిప్రాయాలను తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్త యి, భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి అప్పగించిన నేపథ్యంలో విమానాశ్రయానికి తగిన పేరు సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 19న 'ఎక్స్' వేదికగా ప్రజలను కోరారు. ఈ నేపథ్యంలో దొడ్డి కొమురయ్య పేరును విమానాశ్రయానికి పెట్టాలని మహేందర్ సూచించారు. దొడ్డి కొమురయ్య కడివెండి గ్రామానికి చెందిన పేద గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించిన వ్యక్తి అని మహేందర్ పేర్కొన్నారు. నిజాం పాలనలో వెట్టిచాకిరీ, భారీ పన్నులు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వాటికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కొమురయ్య పాల్గొన్నారని తెలిపారు. 1946 జూలై 4న కడివెండిలో జరిగిన ఘటనలో కాల్పులకు గురై 19 ఏళ్ల వయసులోనే కొమురయ్య అమరుడయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యాంశాల్లో కూడా ఈ ఘటనను తెలంగాణ సాయుధ పోరాటానికి కీలక మలుపుగా పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య అమరత్వం అనంతరం ఉద్యమం మరింత విస్తృత రూపం దాల్చిందని మహేందర్ అన్నారు. తెలంగాణ చరిత్రలో సామాజిక న్యాయం, ప్రజా హక్కులు, ఆత్మగౌరవ పోరాటాలకు ఆయన పేరు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించిన సమయంలో కూడా వరంగల్ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని కోరినట్లు చెప్పారు. కడివెండి గ్రామం వరంగల్‌కు సమీప ప్రాంతంలోనే ఉందని, తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన చారిత్రక ఘట్టాల్లో వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉందని మహేందర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ నేలపై నిర్మిస్తున్న విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టడం చారిత్రకంగా ప్రాధాన్యత కలిగిన నిర్ణయంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశంలోని పలు విమానాశ్రయాలకు చారిత్రక, సామాజిక, ప్రజా నాయకుల పేర్లు పెట్టిన ఉదాహరణలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. రాంచీ విమానాశ్రయానికి బిర్సా ముండా, నాగ్‌పూర్ విమానాశ్రయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. వరంగల్‌లోనూ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, సమ్మక్క సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వంటి పేర్లతో సంస్థలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో కీలక స్థానాన్ని కలిగిన దొడ్డి కొమురయ్య పేరును వరంగల్ విమానాశ్రయానికి పెట్టడం ద్వారా ఆయన సేవలు, త్యాగం భావితరాలకు మరింతగా పరిచయం అవుతాయని మహేందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ప్రజాప్రతినిధులు ఈ ప్రతిపాదనను పరిశీలించి దొడ్డి కొమురయ్య పేరును విమానాశ్రయానికి ఖరారు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : పూజారి ప్రవీణ్ కురుమ



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రవీణ్ కురుమ ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ సాధన కోసం, అభివృద్ధి కోసం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయక మన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నాయకులు సురేష్ ముదిరాజ్, పూజారి ప్రవీణ్ కురుమ, ప్రవీణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు

## శంషాబాద్‌లో కారులో అకస్మాత్తుగా మంటలు

### అప్రమత్తమైన డ్రైవర్.. తప్పిన ప్రాణాపాయం



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాతంరాయి బ్రిడ్జిపై వెళ్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కారు నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై వాహనాన్ని రోడ్డుపక్కకు నిలిపివేశాడు. కొద్దిసేపటికే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే డ్రైవర్ సకాలంలో స్పందించి కారును పక్కకు నిలిపివేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనతో బ్రిడ్జిపై కొద్దిసేపు వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. మంటలు చెలరేగడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## హైదర్‌గూడలో మన్ కీ బాత్ వీక్షణ

### బూత్ నంబర్ 214లో కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు




గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 138వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని హైదర్‌గూడ డివిజన్‌లోని బూత్ నంబర్ 214, ఎర్రబోడ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకుడు కైల రవీందర్‌రెడ్డి నివాసంలో వీక్షించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మన్ కీ బాత్లో ప్రధానమంత్రి దేశ ప్రజల సానుకూల ప్రయత్నాలు, దేశం సాధించిన విజయాల గురించి ప్రస్తావించారు. 2016 సెప్టెంబర్ 28--29 తేదీల్లో భారత సైన్యం నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దాని ప్రాధాన్యతను ప్రస్తావించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనుసరిస్తున్న విధానం గురించి కూడా ప్రధాని తన ప్రసంగంలో వివరించారు. గతంలో దేశంలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావించిన ప్రధాని, 2008 సెప్టెంబర్ 13న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లు, అనంతరం జరిగిన 26/11 ముంబై ఉగ్రదాడిని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానంతో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే 9/11 ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల కుటుంబాలకు తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనితారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, కుక్కునూరి కిరణ్‌చారి, కాసోజు మల్లేష్‌చారి, ఎల్. వెంకటేష్, సాయితేజరెడ్డి, కే. హేమంత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజీ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

## అత్తాపూర్‌లో బూత్ నంబర్ 207లో 'మన్ కీ బాత్' వీక్షణ

### కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్ హైదర్గూడలోని బూత్ నంబర్ 207 పరిధిలో వీక్షించారు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగా వెంకటేష్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రస్తావించిన అంశాలను నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ప్రజలతో వివిధ అంశాలపై ప్రధానమంత్రి తన అభిప్రాయాలను పంచుకునే కార్యక్రమంగా 'మన్ కీ బాత్' కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య, జయానందరెడ్డి, మ్యాడమ్ రాము, బి. భరత్, రాకేష్, వేణు, కార్తీక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కార్ ఎక్కిన మణికొండ కాంగ్రెస్ నాయకులు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగ్ సర్కిల్ పరిధి మణికొండలో రాజకీయ కీలక మలుపు పరిణామంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బి.సాయిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరియు మాజీ ఎమ్.పి.టీ.సి.లు బి. రాజు, పాపాలాల్ సింగ్ మణికొండ మాజీ సర్పంచ్ లు యాలాల నరేష్, బి. జైహింద్ రావు, మణికొండ మాజీ కౌన్సిలర్ యాలాల లావణ్య, చిత్తల రాజేందర్ గౌడ్, బి. అజయ్, బి. శ్రీనివాస్, ఎం. రామకృష్ణారెడ్డి, టి గోవిందు, కాల్వ రమేష్ కాంగ్రెస్ తదితర ఇతర నాయకులు భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో, రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ లో భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టును పుపాలగూడ మీదుగా ఎర్పోర్ట్ వరకూ పొడిగించడానికి గాను సర్వం సిద్ధం చేయగ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే ప్రాజెక్టు విఫలం చేయడం అందుకు స్థానిక శాసన సభ్యుడు గమ్మున ఉండడం వింతలో వింత కాగా, ప్రస్తుత తరుణంలో ప్రజానీకం కరెంటు కోతలకు, ట్రాఫిక్ సమస్యలకు, రియల్ ఎస్టేట్ పడిపోయి ఇబ్బందులు పడడం మామూలు విషయంగా మారింది. ఇక మూసి సమస్య పరిష్కారం నిమిత్తం గత ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా 16 వేల కోట్లు మంజూరు చేయడమే కాకుండా 32 ఎస్ టి పి లు కట్టడం జరిగాయని తత్పర్యంతం ఒక్క ఇటుక కూడా కట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇక అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు ఇక్కడ అనుముల రాజ్యాంగం ఏర్పాటైనదని పరిణామాల ప్రకారం భూములు గుంజుకోవడం తప్ప మరేమీ లేదని పైపెచ్చు పేదలకు డబల్ బెడ్ రూమ్ లు క్రొత్తగా కట్టిన పాపన పోలేదని ప్రస్తావించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఫార్మాసిటీకి బదులు ఫ్యూచర్ సిటీ కడుతామని ప్రగల్బాలు పలుకుతున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని తెలిపారు.



# రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉల్లాస్ పరీక్ష విజయవంతం

**ఉత్సాహంగా పరీక్షకు హాజరైన 100 మంది అభ్యర్థులు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉల్లాస్ పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. శివరాంపల్లి ప్రైమరీ స్కూల్‌తో పాటు రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులతో పాటు వృద్ధులు, పురుషులు, ఇతర అభ్యర్థులు ఉత్సాహంగా హాజరై పరీక్ష రాశారు. మొత్తం 100 మంది అభ్యర్థులు ఉల్లాస్ పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. అక్షరాస్యతను పెంపొందించడం, చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. వివిధ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఆసక్తిగా పాల్గొనడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. డిపిఓ స్వాతి, సిఓలు లక్ష్మణ్, వంశీతో పాటు రిసోర్స్ పర్సన్స్ సమన్వయంతో పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. పరీక్ష విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# టీజీపీఏలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ(టీజీపీఏ)లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు తెలంగాణ సంస్కృతి, భాష, పర్జల హక్కుల కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరనీయమన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు అంకితభావంతో సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు తోట శ్రీనివాసులు, తిరుపతి, సురేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఫణి, మహేష్, అబ్దుల్ నాహర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీ, పోలీస్ అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తలకొండపల్లి బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్‌కు ఘన సన్మానం

**ఆరేళ్ల సేవలను గుర్తు చేసుకున్న 150 మంది కార్యకర్తలు**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** తలకొండపల్లి మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్‌కు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 150 మంది బీజేపీ కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు. గత ఆరు సంవత్సరాలుగా మండల అధ్యక్షుడిగా ఆయన పార్టీకి అందించిన సేవలను కార్యకర్తలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రవి గౌడ్ పార్టీ కోసం పనిచేసే సమయంలో నీతి, ధర్మం, నిబద్ధతకు ప్రాధాన్యతనిస్తూ, కార్యకర్తల పట్ల ఆప్యాయతతో వ్యవహరించారని పలువురు కార్యకర్తలు పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ అందరికీ అందుబాటులో ఉండేవారని గుర్తు చేసుకున్నారు. ఆరు సంవత్సరాల పాటు మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ ఏనాడూ గర్వం, అహంకారం ప్రదర్శించకుండా సాధారణ కార్యకర్తలతో కలిసిమెలిసి పనిచేయడం ఆయన ప్రత్యేకతగా కార్యకర్తలు పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి నుంచి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ బీజేపీని మండలంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేసిన విధానాన్ని వారు గుర్తు చేసుకున్నారు. రవి గౌడ్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను గ్రామగ్రామాన విస్తరించడంలో కార్యకర్తలు కీలకంగా పనిచేశారని, కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా నిలిచిన ఆయన సేవలను ఎప్పటికీ మరువలేమని పలువురు అన్నారు. అనంతరం రవి గౌడ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# శిల్పారామం మాదాపూర్ లో ఘనంగా నేషనల్ డాన్స్ ఫెస్టివల్ - 2026

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** శిల్పారామం హైదరాబాద్, త్రిధారా, ఆకృతి కథక్ కేంద్రం, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో "నేషనల్ డాన్స్ ఫెస్టివల్ - 2026" ను ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నేషనల్ ప్రెజెన్స్ స్కీమ్ సహాయంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ శ్రీ జి. కిషన్ రావు (రిటైర్డ్ ఐఏఎస్), సంగీత నాటక అకాడమీ అవార్డీ మరియు ఆకృతి కథక్ కేంద్ర డైరెక్టర్ పండిట్ రాఘవ్ రాజ్ భట్, త్రిధారా డైరెక్టర్ గురు డా. గజేంద్ర కుమార్ పాండా (భువనేశ్వర్) లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఉత్సవంలో విభిన్న నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



- ఆకృతి కథక్ కేంద్రం – కథక్ నృత్య ప్రదర్శన
- త్రిధారా బృందం – ఒడిస్సీ నృత్య ప్రదర్శన
- సఖి నట నృత్య గురు శ్రీ అలోక్ బిసోయి, డా. సరస్వతి రాజతేష్ – మోహినియాట్టం సోలో ప్రదర్శన
- ఆరాధన డాన్స్ అకాడమీ – గోతిపువా నృత్య ప్రదర్శన
- బిచిత్ర బర్నాలి నాట్య సంసద్ – 'గోటిపువా నాట' ప్రదర్శన
- సంస్కృతి కళా నికేతన్ – ఒడిస్సీ ప్రదర్శన
- అకాడెమిక్ హైట్స్ స్కూల్ – బలేదు బీహు ప్రదర్శన
- అనంతరం పాల్గొన్న కళాకారులందరినీ శ్రీ రాఘవ రాజ్ భట్, శ్రీ గజేంద్ర కుమార్ పాండా ఘనంగా సత్కరించారు.

# రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్ పర్సన్ కీ.శే. రాగం సుజాత యాదవ్ పుణ్యస్మరణ కార్యక్రమం..

క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి: నల్లగండ్ల లోని వర్టెక్స్ కింగ్ స్టన్ పార్క్ విల్లాస్ క్లబ్ హౌస్ లో కీ.శే. రాగం సుజాత యాదవ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పెద్దలకు బియ్యం ఇవ్వడం, దేవాలయంలో గంట కట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీ లు, ప్రముఖ వ్యాపారవేత్తలు శేరిలింగంపల్లి మరియు తదితర ప్రాంతాల నుండి విచ్చేసిన సీనియర్ నాయకులు, పుర ప్రముఖులు, వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ముందుగా అందరూ కీ.శే. రాగం సుజాత యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభా అధ్యక్షులు మాట్లాడుతూ... రాగం వారి ఇంట తీరని విషాదం నెలకొందని, మే 9, 1996 నుండి 30 ఏళ్లకు పైగా రాగం నాగేందర్ యాదవ్ జీవితంలో, ప్రజా సేవలో తోడుగా నిలిచిన రాగం సుజాత యాదవ్ ఇక లేకపోవడం తీరని లోటన్నారు. కౌన్సిలర్ గా (2000–2005), రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్ పర్సన్ గా రెండు పర్యాయాలు సేవలందించి, మహిళల ఆర్థిక ఎదుగుదల కోసం కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన గొప్ప సేవా మూర్తి అని కొనియాడారు. నువ్వు లేని లోటు మాటల్లో చెప్పలేను నీ జ్ఞాపకాలతోనే ఇక నా మిగిలిన ప్రయాణం.. మీ కోరిక మేరకు ఇక నా జీవితం ప్రజా సేవకే అంకితం.. అని రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మన సంప్రదాయం ప్రకారం పెద్దలకు బియ్యం ఇవ్వడం, దేవాలయంలో గంట కట్టే కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు.



పెద్దల దీవెనలు ఆమె ఆత్మకు శాంతిని చేకూరుస్తాయని తెలిపారు. అనంతరం విచ్చేసిన వారందరూ భోజనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి, తమ ఆత్మీయురాలికి నివాళులు అర్పించి, తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గుల్మోహర్ పార్క్ కాలనీలో ఘనంగా గణేష్ లడ్డూ వేలం: రూ.2.55 లక్షలకు దక్కించుకున్న పులిపాటి కుటుంబం



**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గుల్మోహర్ పార్క్ కాలనీ గణేష్ మండపం వద్ద నిర్వహించిన స్వామివారి ప్రసాద లడ్డూ వేలం పాట ఉత్సాహభరితంగా జరిగింది. తీవ్ర పోటీ మధ్య జరిగిన ఈ వేలంలో కాలనీకి చెందిన పులిపాటి కుటుంబం రూ. 2,55,000 లకు లడ్డూను దక్కించుకుంది. ప్లాట్ నంబర్ 6-103/113 నివాసితులైన పులిపాటి శ్రీనివాస్, శ్రీమతి శారద, కౌశల్ మరియు కాశ్యప్ ల కుటుంబం లడ్డూను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పులిపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ, గణనాథుని ప్రసాద లడ్డూను దక్కించుకోవడం తమ కుటుంబానికి ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని, స్వామివారి కృపతో కాలనీవాసులందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. వేలం ద్వారా వచ్చిన నిధులను మండప నిర్వహణకు మరియు స్థానిక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పులిపాటి కుటుంబాన్ని అభినందించారు.

# గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డ్డూ ఇవ్వలేదు

- స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక వినూత్న పథకం తెచ్చాం • గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదు
- నేరెడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ • దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పథకం
- • సన్న బియ్యం పథకంతో పేదలకు చేయూత • పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం సంతృప్తినిచ్చింది
- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి






**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర భారీ నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్ల పట్టణంలోని ఎస్కేఎస్ ఫంక్షన్ హాల్ లో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాల చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం తమ ప్రభుత్వమని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం లేదన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇచ్చి, ప్రతి ఒక్క మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నామని రాష్ట్రంలో 85% మంది జనాభా కు కడుపునిండా అన్నం పెట్టే పథకం పెట్టడం చాలా సంతృప్తినిచ్చిందని అన్నారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సన్న బియ్యం పథకం హుజూర్నగర్ లో అదేవిధంగా కొత్త రేషన్ కార్డులను తిరుమలగిరి నుండి రెండు మన జిల్లా నుండి ప్రారంభించుకోవటం చాలా సంతోషకరమైన విషయమని, అర్హులై ఉండి ఎవరికైనా కార్డు రానివారికి దరఖాస్తు చేసుకున్నచో కొత్త రేషన్ కార్డులు ఇప్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మొత్తం కలిపి 1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, దీంతో 3,42,57,109 మంది ఆహార భద్రత లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. హుజూర్నగర్ నియోజకవర్గంలో మొత్తం రేషన్ కార్డుల 1,08,011 ఉండగా ఈ రోజు కొత్తగా గరిడేపల్లి మండలంలో 20,258, పాలకీడు మండలంలో 9,095, నేరేడుచర్ల మండలంలో 14035 రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని మంత్రి అన్నారు. సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెడుతున్నామని గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన దొడ్డుబియ్యం కోళ్ల ఫారాలు, బీర్ల తయారీ, రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో , పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అగ్రికల్చర్ కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న,జిల్లా ఎస్పీ కే నరసింహ, హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి,వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి,

నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి, తహసిల్దార్ సైదులు, వాజిద్,స్రవంతి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు,ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టింటికి వెళ్తానంది.. మాటామాటా పెరిగింది.. చివరకు భార్య ప్రాణాలను తీసేసాడు!

**చిక్కడపల్లిలో దంపతుల మధ్య వివాదం విషాదాంతం**

**భార్య తలపై రోకలిబండతో దాడి చేసిన భర్త**

**హత్య అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయిన నరేందర్**

**కుటుంబ కలహాలే కారణమని పోలీసుల ప్రాథమిక సమాచారం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ఓ చిన్న కుటుంబ వివాదం తీవ్ర రూపం దాల్చింది. పుట్టింటికి వెళ్తానని భార్య చెప్పడంతో మొదలైన గొడవ చివరకు ఆమె ప్రాణాలనే బలిగొంది. మాటామాటా పెరిగి ఆవేశం హద్దులు దాటడంతో భర్త రోకలిబండతో భార్యపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితుడు స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పులివెందులకు చెందిన నరేందర్, అన్నమయ్య జిల్లాకు చెందిన తేజశ్రీ (26) దంపతులు. వీరికి 2020లో వివాహం జరిగింది. నాలుగేళ్ల కుమారుడు రోహిత్ ఉన్నాడు. నాలుగు నెలల క్రితం ఈ దంపతులు హైదరాబాద్‌కు వచ్చి చిక్కడపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. నరేందర్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ హోటల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తుండగా.. తేజశ్రీ గృహిణిగా ఉంటున్నారు.

**పుట్టింటికి వెళ్తానని చెప్పడంతో..**

పుట్టింటికి వెళ్తానని తేజశ్రీ చెప్పడంతో భార్యాభర్తల మధ్య వివాదం మొదలైనట్లు పోలీసులు వెల్లడించారు. ఆ గొడవ క్రమంగా తీవ్రరూపం దాల్చింది. ఈ సమయంలో కోపోద్రిక్తుడైన నరేందర్ రోకలిబండతో తేజశ్రీ తలపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

**హత్య తర్వాత నేరుగా పోలీస్‌స్టేషన్‌కు..**

భార్యను హత్య చేసిన అనంతరం నరేందర్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన ఆ కుటుంబంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.

## వాట్సాప్‌లో డీల్స్.. ఇంట్లో దందా.. గుంటూరులో పోలీసుల దాడితో బయటపడిన గుట్టు!

**భారత్‌పేటలో ఇంటిపై టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ పోలీసుల సంయుక్త దాడి**

**నలుగురు మహిళలు, ఓ విటుడు అదుపులోకి.. 5 సెల్‌ఫోన్లు స్వాధీనం**

**నిర్వాహకురాలిగా గోరంట్లకు చెందిన మహిళను గుర్తించిన పోలీసులు**

**వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపి విటులతో డీల్స్ చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి**

**గుంటూరు, సెప్టెంబర్ 27:** గుంటూరు నగరంలో ఓ ఇంటి చుట్టూ కొంతకాలంగా సాగుతున్న వ్యవహారంపై పోలీసులకు అనుమానం వచ్చింది. బయటకు సాధారణంగా కనిపించిన ఆ ఇంట్లోకి ఎవరెవరో వచ్చి వెళ్తున్నారన్న సమాచారంతో నిఘా పెట్టారు. చివరకు పక్కా సమాచారం అందడంతో పోలీసులు ఒక్కసారిగా అక్కడికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లిన పోలీసులకు కనిపించిన దృశ్యాలతో అసలు వ్యవహారం బయటపడింది. గుంటూరు నగరంలోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. భారత్‌పేట 7వ లైన్‌లోని ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, అరండల్‌పేట పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు.

**పక్కా సమాచారంతో దాడి**

ఎస్‌బీ డీఎస్పీ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ సీఐ పర్యవేక్షణలో నగరంలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో భారత్‌పేటలోని ఓ ఇంటికి సంబంధించి సమాచారం అందడంతో అధికారులు దానిని పరిశీలించారు. సమాచారం నిర్ధారించుకున్న అనంతరం ఆదివారం మధ్యాహ్నం సుమారు 12:45 గంటల సమయంలో సంయుక్త బృందం అక్కడికి వెళ్లింది. పోలీసులు ఇంటిపై దాడి చేయడంతో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. తనిఖీల్లో నలుగురు మహిళలతో పాటు ఓ విటుడు పోలీసులకు పట్టుబడ్డారు. మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు వారి వద్ద ఉన్న ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**వాట్సాప్‌లోనే పరిచయాలు.. ఆ తర్వాత డీల్స్?**

పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ వ్యవహారానికి సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. గోరంట్లకు చెందిన పి. సాయి లక్ష్మి అలియాస్ అంజలి ఈ వ్యవహారానికి నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. విటులను ఆకర్షించేందుకు వాట్సాప్ ద్వారా యువతుల ఫొటోలు పంపడం, అనంతరం వారితో సంప్రదింపులు జరిపి డీల్స్ కుదుర్చుకోవడం వంటి వ్యవహారం సాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు.

**ఐదు ఫోన్లలో ఏముంది?**

దాడి సమయంలో స్వాధీనం చేసుకున్న ఐదు సెల్‌ఫోన్లు ఇప్పుడు ఈ కేసులో కీలకంగా మారాయి. వాటిలో ఉన్న సమాచారాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఎవరెవరితో సంప్రదింపులు జరిగాయి? ఎంతకాలంగా ఈ వ్యవహారం కొనసాగుతోంది? ఇంకా ఎవరెవరికి సంబంధం ఉంది? అనే కోణాల్లో దర్యాప్తు సాగుతోంది.అలాగే ఈ వ్యవహారంలో మరెవరైనా నిర్వాహకులు ఉన్నారా? బయట ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చారా? అనే అంశాలపైనా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

## వనపర్తి జిల్లా నూతన యువజన సంఘం ఏకగ్రీవం ఎన్నిక

**యువజన సంగం అధ్యక్షుడిగా సూర్యవంశం రామకృష్ణ**

**యువజన సంగం ప్రధాన కార్యదర్శిగా సూర్యవంశం రాముడు**

**రాజకీయ విభాగం అధ్యక్షుడు. సూర్యవంశం రాఘవేందర్**



**వనపర్తి సెప్టెంబర్ 27 క్రైమ్ మిర్రర్ :** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం. అధ్యక్షులు నడికుడి జయంతి రావు. ప్రధాన కార్యదర్శి దయానంద్. వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం. ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా 15 మండలాల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో ఆదివారం ఎన్విఆర్ బంకేట్ హాల్ లో వనపర్తి జిల్లా అధ్యక్షులు సూగురు .రాములు, ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు. జిల్లా కమిటీ. స్టీరింగ్ కమిటీ, 15 మండలాల అధ్యక్షులు,మరియు యూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో కుమ్మరి కులస్తుల ఏకాభిప్రాయ సేకరణతో,జిల్లా యువజన అధ్యక్షులుగా సూర్యవం. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సూర్యవంశం. రాముడు. ఉపాధ్యక్షులుగా సూర్యవంశం తేజ కోశాధికారిగా సూర్యవంశం. రాంబాబు. కార్యదర్శిగా గుణగంటి.ఎల్ల స్వామి నీ. కుల బంధువుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షులు, సుగురు రాములు మాట్లాడుతూ. ఈ సమాజంలో కుమ్మరి యువత సమస్యలపై అవగాహన, సమాజ సేవా దృక్పథం మరియు సంఘం అభివృద్ధికి, అందరినీ కలుపుకొనిపోయే గుణం, ఉండాలని ఆయన అన్నారు.యువతను చైతన్యపరిచే విధంగా,సంఘం సంఘటితంచేసి,సంఘం సభ్యుల సమస్యలను పరిష్కరించే విధంగా ,చురుకు గా పనిచేసే నాయకత్వంతో పూర్తిస్థాయిలో యువజన సంఘాన్ని బలోపేతం చేయాలనారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు, సకాలంలో ప్రతి ఒక్క కుమ్మరికి అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మర సంఘం కమిటీ సభ్యులు. కుమ్మర సంఘం నాయకులు. 15 మండలాల అధ్యక్షులు, మండల యూత్ అధ్యక్షులు మరియు కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు

## స్నేహితుడిని కలిసి వస్తానన్నాడు.. తీరా గ్రామ శివారులో శవమై కనిపించాడు!

**ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్.. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్**

**చివరిసారిగా వైన్స్ వద్ద బంధువుతో కనిపించినట్లు సమాచారం**

**రోజుల తర్వాత గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతదేహం**

**మృతికి కారణమేంటి? పోస్టుమార్టం నివేదికపై పోలీసుల దృష్టి**



**మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 27:** ఒక చిన్న మాట చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 'స్నేహితుడిని కలిసి వస్తా' అన్నదే అతను కుటుంబ సభ్యులతో చెప్పిన చివరి మాట. ఆ తర్వాత ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. బంధువుల ఇళ్లలోనూ ఆరా తీశారు. చివరకు పోలీసులకు మిస్సింగ్ ఫిర్యాదు చేశారు. ఇంతలో ఊహించని విధంగా గ్రామ శివారులో అతడి మృతదేహం కనిపించింది. దీంతో అసలు ఏం జరిగిందనే ప్రశ్న ఇప్పుడు మిస్టరీగా మారింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన కుడుకల శ్రీనివాస్ (40) ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్నేహితుడిని కలసి వస్తానని చెప్పి మంచిర్యాల వైపు వెళ్లిన ఆయన రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరుకోలేదు. మొదట కుటుంబ సభ్యులు సాధారణంగానే భావించినా సమయం గడిచేకొద్దీ ఆందోళన పెరిగింది. శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా స్పందన రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అతడి కోసం వెతకడం ప్రారంభించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు చేశారు.

**చివరిసారి ఎక్కడ కనిపించాడు?**

శ్రీనివాస్ మిస్సింగ్ అయిన రోజే రాత్రి సుమారు 8 గంటల సమయంలో చెన్నూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర వైన్స్ వద్ద కనిపించినట్లు సమాచారం. అక్కడ తన దూరపు బంధువు గోదరి సమ్మయ్యతో కలిసి మద్యం సేవించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అక్కడి నుంచి శ్రీనివాస్ ఎటువైపు వెళ్లాడు? ఎవరితో వెళ్లాడు? ఆ తర్వాత ఏం జరిగింది? అనే విషయాలపై ఇప్పుడు పోలీసులు దృష్టి సారించారు.

**శివారులో కనిపించిన మృతదేహం**

శ్రీనివాస్ కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలిస్తుండగానే శనివారం చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామ శివారులో ఆయన మృతదేహం కనిపించింది. అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

**సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలెన్నో..**

శ్రీనివాస్ మరణం ప్రమాదమా? సహజ మరణమా? లేక మరేదైనా కారణముందా? అనే అంశాలపై ప్రస్తుతం స్పష్టత లేదు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి సంబంధించిన కీలక వివరాలు బయటపడే అవకాశం ఉంది. ఇక శ్రీనివాస్ చివరిసారిగా ఎక్కడ కనిపించాడు, ఎవరెవరిని కలిశాడు, ఆ తర్వాత అతడి కదలికలు ఎలా ఉన్నాయి అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఘటనాస్థలంలో లభించిన ఆధారాలతో పాటు అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం శ్రీనివాస్ మృతికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల విచారణలో వెలుగు చూసే వివరాలపై కుటుంబ సభ్యుల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.